
**Paper Title :** Ganga Prashasthi

**Journal Name:** Bhavaveena, International Journal of Telugu Literary,Culture & Language Study, Volume: 15, Issue 11, November 2018.



## Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ రామావతార ఆంతర్యం - నామ ప్రాశస్త్యం | - ఐ. సజని | 5 |
| 2. | శ్రీదేవి గారి నవలలోని సంఘ పరిస్థితులు - ప్రభావం | - జె. సంజమ్మ | 9 |
| 3. | దివిసీమలో కోలాటం- నృత్య ప్రదర్శన | - కైలా హేమబాంధవి | 14 |
| 4. | నానీ కవితల్లో కర్షకుని వెతలు | - డా. ఎన్. అంబర్ సింగ్ | 16 |
| 5. | తెలంగాణ సాంస్కృతిక ప్రతీక - బొడ్డెమ్మ పండుగ | - డా. ఇడికోజు శ్రీనివాసాచారి | 19 |
| 6. | సినారె "భూగోళమంత మనిషిబొమ్మ" కవిత్వం | - డాక్టర్ కోదండ లక్ష్మణ | 21 |
| 7. | జ్ఞానానంద కవి - కథాకావ్యాలు వస్తు విశ్లేషణ | - ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి | 27 |
| 8. | వెల్లాల కొండలరావు - జీవిత విశేషాలు | - మండలోజు. నర్సింహస్వామి | 32 |
| 9. | వరంగల్ జిల్లా జానపద గేయకథలలో సామాజికాంశాలు | - ధారవత్ సంతోష్ కుమార్ | 35 |
| 10. | బోధనా భాషగా తెలుగు అవశ్యకత-పరిరక్షణ | - డా॥ బి.సరస్వతి | 38 |
| 11. | గురజాడ కథానికలు - స్త్రీ సమస్యాచిత్రణ | - డా॥. కె.వెంకటరమణ | 40 |
| 12. | గంగా ప్రశస్తి | - వై. విజయలలిత | 43 |
| 13. | ఛందో వర్ణన సమీక్షణం | - ఆచార్య గోగినేని యోగ ప్రభావతీ దేవి. | 45 |
| 14. | "బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య బాడాల రామయ్య" | - డా॥ పి. భారతీ రమేష్ | 50 |
| 15. | సినిమాగా విశ్వనాథ 'ఏకవీర' శిల్ప వైవిధ్యం | - డా. దార సుమన్ | 53 |
| 16. | రుంజ కవిత్వం-ఒక పరిశీలన | - డా. చింతం ప్రవీణ్ కుమార్ | 61 |
| 17. | దళితఉద్యమ సాహిత్యం - ఏకీకరణవాదం | - సిద్దార్థ మద్దిరాల | 63 |
| 18 | తెలంగాణ ఉద్యమ కవిత్వం - జాగో . . . జాగోవో | - డా॥ వేలూరి శ్రీదేవి | 67 |
| 19. | వాన వెలిశాక.... మనసును తడిపిన కవిత్వం | - వి. వింధ్యవాసినీ దేవి | 70 |
| 20 | తెలంగాణ పునర్నిర్మాణంలో జానపద విజ్ఞాన భాగస్వామ్యం | - తాటికాయల భోజన్న | 73 |
| 21. | రాయలసీమ రచయిత్రుల కథాసాహిత్యం | - జి.హేమలత | 76 |
| 22. | 'చిత్తూరు కథ'లో చిత్రింపబడ్డ ప్రజల ఆర్థిక దుస్థితి | - పి. జయచంద్రుడు | 78 |
| 23. | తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాటపాత్ర | - జోగు సంతోష్ కుమార్ | 83 |
| 24. | తెలుగు సాహిత్యంలో స్త్రీ వాదం - పరిశీలన | - డా॥ పప్పుల వెంకటరమణ | 84 |
| 25. | శ్రీ బండి నారాయణస్వామి కొన్ని కథలపై సమీక్ష | - ఎస్. రామాంజనేయులు | 88 |
| 26. | 'ఆముక్తమాల్యద' కావ్యం వెల్లడిపర్చిన వైష్ణవ భక్తి తత్త్వం | - ఉంద్రాజవరపు సంపతరావు | 91 |
| 27. | శ్రీనాథయుగసాహిత్యం- కథాకావ్యాలు | - రాంభట్ల వేంకటరాయశర్మ | 94 |
| 28. | జానపద విజ్ఞానంలో గ్రామ దేవతలు - ప్రాధాన్యత | - యం. అనూరాధ | 97 |
| 29. | ఏ.వి.మల్లేశ్వరరావు నాటకాలు - సామాజికాంశాలు | - డి.సి.వెంకట సుబ్బయ్య | 101 |
| 30. | ఆచార్య కొలకలూరి ఇనాక్ కవిత్వం - మానవతా ప్రభోదం | - దారపోగు ప్రకాష్ | 104 |
| 31. | తెలంగాణ కథ - చాకలి జీవిత చిత్రణ | - పి. దస్తగిరి | 109 |
| 32. | కాటమరాజు కథల్లో స్త్రీ | - డా॥ యస్.జ్యోత్స్నారాణి | 111 |
| 33. | నల్లగొండ జిల్లా కథలు - వస్తు వైవిధ్యం | - పాపుగంటి సజ్జన కుమారి | |
| 34. | స్వాతంత్ర్యానంతర తెలుగు నవలా సాహిత్యం | - డా॥ చుక్కా శ్యామల కుమార్ | |
| 35. | అన్నమయ్య సాహిత్యం - సామాజిక సంస్కరణ | - డా॥. అప్పిరెడ్డి హరినాథరెడ్డి | |




REDMI NOTE 9
AI QUAD CAMERA

Vol. 15, Issue. 11, November - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# గంగా ప్రశస్తి

- వై. విజయలలిత, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగు శాఖ, హన్మకొండ, వరంగల్.

బ్రహ్మ కమండలములో వుండు గంగ, విష్ణుమూర్తి పాదము నుండి ఉద్భవించిన గంగ, శివుని శిరస్సున ధరించ బడిన గంగగా త్రిమూర్తులను ఆశ్రయించిన గంగ పవిత్ర మైనది. స్వర్గ, భూలోక, పాతాళలోక మార్గములను తన ప్రవాహముచే పవిత్రీకరింప చేయుచూ "త్రిపథ" గా ప్రసిద్ధి చెందినది.

బ్రహ్మాణ్ విష్ణునదీ గంగా త్రైలోక్యం వ్యాప్యతిష్ఠతి
యథాతథా భృగు శ్రేష్ఠ సర్వమేవ ప్రకీర్తయ!

- (విష్ణుపురాణము)

గంగ యొక్క ప్రశస్తి గురించి వివిధ పురాణాలలో, ఇతి హాసాలలో అనేక వాపాఖ్యానాలలో వివరించబడినవి.

## 1. విష్ణుపది (విష్ణు పురాణము) :

దానవ శ్రేష్ఠుడైన బలిచక్రవర్తి తన పరాక్రమముతో మూడు లోకాలను జయించిన వాడు. బలిచక్రవర్తి యొక్క గర్వముకు అణచడం కోసంవిష్ణు మూర్తి "వామనావతారము" ను ధరించివచ్చెను. వామనుడు బలిచక్రవర్తిని మూడు అడుగుల నేలను దానముగా కొరెను. అందుకు బలి చక్రవర్తి అంగీకరించెను. వామనుడి మొదటి అడుగు భూమిని తాకెను, రెండవ అడుగు ధ్రువ మండలమును తాకెను. మూడవ అడుగు హరి బ్రహ్మాండలమును తాకెను. అప్పుడు బ్రహ్మాండము పగిలి రంధ్రము పడి బ్రహ్మాండములో వున్న దేవనది అయిన గంగ శతఘ్నివలె ఆ ఉదకము ఉపొంగి శ్రీ మహా విష్ణువు బొటనవ్రేలి నుండి వుద్భవించినది కావున గంగ "విష్ణుపది" అయినది.

ప్రవిశ్యదేవి బ్రహ్మాండం విష్ణులోక యుపాగతౌ
బ్రహ్మీం సభాం ప్లావయిత్వాతపోలోక ముపాగతా!

- (విష్ణు పురాణము)

## 2. గంగ - సరస్వతి - లక్ష్మి కలహ గాథ - (దేవీ భాగవతము) :

పూర్వము లక్ష్మి, సరస్వతి, గంగ ఈ ముగ్గురు శ్రీ మహావిష్ణువు యొక్క భార్యలు. విష్ణువు గంగ, లక్ష్మి వీరిరువురి మీద ఎక్కువగా ప్రేమ కల్గివున్నాడని, భావించిన సరస్వతి, స్వామి! మీకు గంగపట్ల ప్రేమ అధికం - లక్ష్మి పట్ల ప్రేమ అధికమే. నేనంటేనే ఇష్టం లేదు అని నింధించింది. శ్రీమన్నారాయణుడు అక్కడి నుండి మౌనంగా అక్కడి నుండి నిష్క్ర మించాడు.

సరస్వతికి కోపం వచ్చి లక్ష్మి గంగలను శపించింది. "ఓ లక్ష్మి! నువ్వు ఒక చెట్టుగా, ఒక నదిగా అయిపో ఇది నా శాపం" మరియు "ఓ గంగ! నువ్వు భూలోకానికి వెళ్ళి నదిగా ప్రవహిస్తావు అందరి పాపాలు గ్రహిస్తావు" అని ఇరువురిని శపించింది. అందుకు లక్ష్మీదేవి బాధపడుతూ మౌనంగా వున్న గంగకు కోపం వచ్చింది. సరస్వతి కారణం లేకుండా మమ్ములను శపిస్తావా? "నువ్వే నదీ రూపం పొంది భూలోకంలో పాపాత్ముల మధ్య ప్రవహించు" అని గంగ సరస్వతిని శపించింది.

అప్పుడు నారాయుణుడు ప్రత్యక్షమై సరస్వతిని అక్కున చేర్చుకొని పురాతన జ్ఞానాన్ని ఉపదేశించాడు. కలహానికి - శాపానికి గల రహస్య కారణాన్ని తెలియజేశాడు. సరస్వతి వాక్కు సత్యమైనది కావున లక్ష్మీదేవి - గంగ - సరస్వతి ఈ ముగ్గురి యొక్క శాపాలను నారాయణుడు వివరించి చెప్పెను.

లక్ష్మీ! నువ్వు పద్మావతి నదిగా భారత దేశంలో ప్రవహించు, భూలోకంలో ధర్మధ్వజుడి గృహంలో కళాంశ రూపంలో అయోనిజగా అతనికి కూతురుగా అవతరించు అక్కడే నీకు వృక్షత్వం ప్రాప్తిస్తుంది. అలాగే "తులసి" పేరుతో పరమపావనమూర్తివై మరొక కళాంశ రూపాన భారత దేశంలో అవతరించు. నా అంశతో అవతరించే శంఖచూడుడు అనే అసురుడికి భార్యవై అటుపైన కొంతకాలానికి మళ్ళీ నన్ను చేరుకుందువు గాని అని లక్ష్మీదేవిని ఓదార్చినాడు.

గంగ - నువ్వు సరస్వతి ఇచ్చిన శాపం కారణంగా భారత దేశంలో నదిగా అవతరించు అది నీ అంశవతారాం, పాపాత్ములను పవిత్రీకరించు నువ్వు వైకుంఠంలో పద్మంగాను, శివస్థానమైన కైలాసంలో గంగగాను కీర్తింపబడుతావు.

చంద్ర పద్మ క్షీరనిభాశుద్ధసత్వ స్వరూపిణీ
నిర్మలా నిరహంకారా సాధ్వీ నారాయణ ప్రియా!

క్రోదరహితమై శాంత సత్వ స్వరూపిణివై మహా సాధ్వివై ధర్మచారిణివై సుశీలవై పరమపావనివై అందరి ప్రశంసలు, పూజలు అందుకుంటూ నారాయణునికి ఇష్టమైన దానిగా ఉంటావు. భగీరథుడు తపస్సు చేసి భూలోకానికి తీసుకు వెలతాడు. సముద్రుడికి భార్యవవుతావు. అలాగే నా అంశతో అవతరించే శంతనుడికి ఇల్లాలివి అవుతావు. నిత్యము శివుని ఆశ్రయించి వుంటావు, అని చెప్పి గంగను ఓదార్చినాడు.

సరస్వతి! నువ్వు కూడా కళాంశగా భారత భూమిలో నదిగా అవతరించు. సత్యలోకములో బ్రహ్మకు భార్యవై అనందించు అని సరస్వతిని ఓదార్చినాడు.

REDMI NOTE 9
AI QUAD CAMERA

BHAVAVEENA
Vol. 15, Issue. 11, November - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

గంగా - సరస్వతి - లక్ష్మీదేవి ఒకరికి ఒకరు ఇచ్చుకున్న శాపము కారణంగా గంగ భూ మండలమున శాస్వితముగా జీవనదిగా ప్రవహించుచున్నది.

**3. సురనది - (రామాయణము - బాలకాండము) :**

హిమవంతునికి, మనోరమకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె గంగ, రెండవ కుమార్తె ఉమ. దేవతలందరు జేష్ఠ పుత్రిక అయిన గంగను మూడు లోకాలకు శుభమును కలిగించడము కోసం ఇవ్వమని కోరినారు. హిమవంతుడు ధర్మమును పాటించి మూడు లోకాలకు హితము కలుగవలెననితన జేష్ఠ పుత్రికయైన గంగను వారికిచ్చెను. పాపరహితమైన జల రూపమున ప్రవహించు గంగను స్వర్గమునకు తీసుకొని పోవుట వలన "సురనది" అయినది.

**4. భగీరథ ప్రయత్నము - గంగ భూమికి చేరుట - (రామాయణము - బాలకాండము) :**

పంచభూతాలలో ఒకటైన నీరు (గంగ) జీవకోటికి ఎంతో ప్రధానమైనది. భగీరథుడు తన తాతలైన సగర కుమారులకు స్వర్గ పుప్రాప్తి కల్గించుటకు బ్రహ్మను గూర్చి తపస్సు చేసెను. ఓ రాజర్షి భగీరథ, గంగను ధరించుటకు శివుడు తక్క సమర్థుడగు వేరొకడు లేడు. కావున శివుని గూర్చి తపస్సు చేయుమని బ్రహ్మ ఉపదేశించెను. ఆ భగీరథుడు శివుని గూర్చి తపస్సు చేసి భూమికి గంగను తెప్పించెను.

యతోభగీరథో రాజాతతోగఙ్గా యశస్వనీ
జగామ సిరితాం శ్రేష్ఠా సర్వపాప ప్రణాశినీ!

సర్వపాపాలు హరించునటువంటి పవిత్రమైన గంగ యశస్విని నది శ్రేష్ఠయైన గంగ భగీరథుని అనుసరించెను. భగీరథుడు గంగను భూమికి తెప్పించడము వలన "భగీరథీ"గా ప్రసిద్ధి చెందినది.

రాజర్షి భగీరథుడు ఎంతో ప్రయత్నముతో గంగను కొనిపోయి భస్మీభూతులైయున్న తన తాతలకు స్వర్గ ప్రాప్తి కల్గించెను.

**5. గంగా - శాంతనుల వివాహము - ( భారతము - ఆది పర్వము) :**

ప్రతీపుడు సునందాదేవీల కుమారుడు శాంతనుడు. ప్రతీపుడు శాంతమునికి పట్టాభిషేకం చేసి తను తపోవనమునకు వెళ్ళాడు. శాంతనుడు రాజ్యపరిపాలన చేస్తూ ఒక నాడు వేటకై గంగాతీరానికి వెళ్ళాడు, అక్కడ దివ్యమైన వస్త్రాల మణి భూషణాలతో ప్రకాశిస్తున్న గంగను శాంతనుడు చూశాడు.

ఈమె వనకన్య, నాగకన్య, దేవకన్య అయివుంటుందని మానవ కన్య కాదని తలచి తనను వివాహం చేసుకోమని గంగను కోరినాడు. అందుకు అంగీకరించిన గంగ రాజా! నన్ను వివాహం చేసుకోవాలంటే నేనేమి చేసినా నీవు అంగీకరించాలి, అడ్డు చెప్పకూడదు. ఏరోజు అయితే నా నిర్ణయానికి అడ్డు చెప్పుతారో అప్పుడే శాశ్వితముగా నీ నుండి వెళ్ళిపోతాను. నా నిర్ణయం ప్రకారం నడుచుకుంటేనే వివాహం చేసుకుంటానని అన్నది. దానికి అంగీకరించిన శాంతనుడు గంగను వివాహం చేసుకుంటాడు.

గంగాదేవికి వరుసగా మగశిశువులు జన్మించారు. శిశువు పుట్టిన వెంటనే ఒక్కొక్కరిని గంగకు అర్పిస్తుండేది. శాంతనుడు బాధపడి నిర్థయగా ఇలా ఎందుకు చేస్తున్నావని అడుగుదామనుకొని, అడిగితే తనను విడిచి వెళ్ళిపోతుందేమో నన్న భయంగా మౌనంగా ఉండేవాడు. అష్టమ సంతానం జన్మించినప్పుడు పుత్ర వ్యామోహంతో శాంతనుడు ఈ శిశువును గంగపాలు చేయవద్దంటాడు. గంగ నీవు ఇంత మంది పుత్రులను కని కొడుకుల పాలిట మృత్యుదేవతవైనావు. బాల సూర్యునివలె ప్రకాశిస్తున్న ఈ కుమారుని మాత్రం నేను విడవలేను అన్నాడు. శాంతనుని అప్రియమైన మాటలు విన్న గంగాదేవి " నీతో సాంగత్యం ఇంతటితో సరి, నేను పావన గంగానదిని, ఈ పుట్టినవారంతా వశిష్ఠుని శాపం పొందిన వసువులు. వారు మరొకచోట పుట్టలేమని మానవ లోకంలో చాలా కాలం వాండలేమని నా గర్భవాసానే పుడుతామని మమ్మల్ని ముక్తులను చేయమని నన్ను ప్రార్థించినారు. దేవ హితాన్ని కోరి మానవకాంత రూపాన నీ వలన వీరికి జన్మనిచ్చాను". దీని వలన నీకు శాశ్వితముగా పుణ్యలోకాలు కలుగుతాయి. ఈ అష్టమ వసువు దీర్ఘాయుష్మంతుడిగా, సకల ధర్మమూర్తిగా, ఈ మానవ లోకంలో చాలా కాలం వుంటాడు. గంగ కుమారుని శాంతనునికి అప్పగించి వెళ్ళిపోయింది. ఆ కుమారుడు గంగేయుడిగా, దేవ వ్రతుడుగా, భీష్మునిగా ప్రసిద్ధి గాంచినాడు. పుణీతమైన పావన గంగ సకల ప్రాణికోటి యొక్క జీవనాధారమై జీవనదిగా ప్రవహించుచున్నది.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీ విష్ణు ధర్మోత్తర మహాపురాణము - విద్వాన్ శ్రీ జంద్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి
2. దేవి భాగవతము - ఆచార్య బేతవోలు రాజబ్రహ్మం
3. శ్రీ [illegible] బాలకాండము - ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడు
4. [illegible] ఆదిపర్వము - నన్నయ

REDMI NOTE 9
AI QUAD CAMERA